సాక్షి కర్నూలు

బుధవారం ၊ 12 ၊ ఏప్రిల్ ၊ 2023



జగన్మాతా పాహిమాం!

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం జగన్మాత అయిన శ్రీశైల భ్రామరీకి వార్షిక కుంభోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు,స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



ఎస్‌ఏ-2 పరీక్షలకు సన్నద్ధం

ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో భాగంగా సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)-2 పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. 8లో



అభివృద్ధి పనులు ప్రారంభం

అవుకు మండలం గుండ్లశింగవరంలో రూ.2.60 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు ప్రారంభించారు. 10లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:41
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:44
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:44
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:38
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:38

హదీస్ వెలుగు :

డబ్బు ఇచ్చి వడ్డీ తీసుకోవడం మహా పాపం. ఈ హరామ్ సొమ్ముతో ఏ శుభకార్యం చేసినా అల్లాహ్ అంగీకరించరు. వడ్డీ లావాదేవీల నుంచి దూరంగా ఉండండి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

బ్లడ్ బ్యాంకుల తనిఖీ



ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంకును తనిఖీ చేస్తున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్

కర్నూలు(హాస్పిటల్): ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ మంగళవారం కర్నూలు నగరంలోని పలు బ్లడ్ బ్యాంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్లడ్‌బ్యాంకుల్లో ఉన్న ధరల పట్టికలను, క్యాంపుల ద్వారా వచ్చిన రక్త సేకరణ వివరాలను ఆయన తెలుసుకున్నారు. క్యాంపుల ద్వారా వచ్చే రక్తంలో 30 శాతం ప్రభుత్వ ఆసుపత్రికి ఇస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. తలసీమియా బాధితులకు చేస్తున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే బాధితులకు రక్తం ఉచితంగా ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎయిడ్స్, లెప్రసి, క్షయ అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి అలీహైదర్, వివిధ రక్తనిధుల వైద్యాధికారులు ఉన్నారు.

16న హాకీ పురుషుల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్‌పీజీ క్రీడా మైదానంలో ఈనెల 16న హాకీ పురుషుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 1994 సంవత్సరం జనవరి 1 వ తేదీ తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 21 నుంచి సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే 13 వ హాకీ ఆంధ్రప్రదేశ్ సీనియర్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్: 99665 65317 ను సంప్రదించాలన్నారు.

భానుడు@ 42.4

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఎండల తీవ్రత మరింత పెరిగింది. కర్నూలు జిల్లాతో పోలిస్తే నంద్యాల జిల్లాలో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. వడగాలుల తీవ్రత అధికమవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఓర్వకల్లు మండలం నన్నూరులో 41.8 డిగ్రీలు, కర్నూలు అర్బన్‌లో 41.4, కోడుమూరు మండలం లద్దగిరిలో 41.2, కర్నూలు మండలం జి.సింగవరంలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలులో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా అధికంగా ఉండటం గమనార్హం. నంద్యాల జిల్లా పాములపాడులో అత్యధికంగా 42.4 డిగ్రీలు, బండిఆత్మకూరు మండలం పెద్ద దేవలాపురంలో 42.4, అవుకులో 42.3, నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామంలో 42.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏప్రిల్ నెల మొదటి పక్షంలోనే ఎండల తీవ్రతకు బండరాళ్లు పగులుతున్నాయంటే రోహిణి కార్తెలో ఇంక ఏ స్థాయిలో ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఒకే ప్రశ్నపత్రంలో బయాలజీ, ఫిజిక్స్

కర్నూలు సిటీ: పదో తరగతి సైన్స్ సబ్జెక్టు ప్రశ్నపత్రంలోనే బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని డీఈఓ డా.వి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ సబ్జెక్టులోని పార్ట్–ఏలో ఫిజికల్ సైన్స్ ప్రశ్నలు 1 నుంచి 16 వరకు, పార్ట్–బీలో బయోలాజికల్ సైన్స్‌కు సంబంధించి 17 నుంచి 33 వరకు ఉంటాయన్నారు. జవాబులు రాసేందుకు విడివిడిగా ఓఎంఆర్ సీట్లు అందజేస్తారన్నారు. ఫిజికల్ సైన్స్ ఓఎంఆర్‌పై పేపరు కోడ్–19, సైన్స్ పి–1అని, బయోలాజికల్ సైన్స్ ఓఎంఆర్‌పై పేపరు కోడ్–20, సైన్స్ పి–2 అని ముద్రించి ఉంటాయన్నారు. విద్యార్థులు పరిశీలించి జవాబులు రాయాలన్నారు.



ఈ చిత్రంలోని మహిళ పేరు మమత. కర్నూలు మండలం పసుపల గ్రామానికి చెందిన ఈమె మాయావతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. 2003 నుంచి పొదుపు సంఘంలో రాణిస్తున్నారు. ఇప్పటి వరకు సంఘం ద్వారా పసుపలలోని కెనరా బ్యాంకు నుంచి 8 సార్లు లింకేజీ రుణం తీసుకున్నారు. ప్రభుత్వం కూడా వైఎస్ఆర్ చేయూత, ఆసరా తదితర పథకాల ద్వారా ఆదుకుంటోంది. మొదట్లో వ్యవసాయ కూలీ అయిన ఈమె లింకేజీ రుణంతో మొదట చిన్న దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. 6,7 వ విడత లింకేజీ రుణం ద్వారా కిరాణం షాపు పెట్టారు. రోజుకు రూ.4000–4500 వరకు వ్యాపారం జరుగుతోంది. పిల్లలను బాగా చదివిస్తున్నట్లు ఈమె తెలిపారు.



వీరు ఆదోని మండలం మండగిరి గ్రామానికి చెందిన సీతారాం స్వయం సహాయక సంఘానికి చెందిన మహిళలు. ఈ సంఘంలో మొత్తం 10 మంది మహిళలు ఉన్నారు. 2022–23లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సదాపురం శాఖ రూ.20 లక్షల లింకేజీ రుణం ఇచ్చింది. ఈ రుణంతో గ్రూపులోని సభ్యులందరూ వివిధ జీవనోపాధులను ఏర్పరచుకున్నారు. ఈ సంఘానికి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ లభించాయి. సంఘంలోని మహిళలకు వైఎసార్ చేయూత కూడా వచ్చింది. ప్రభావతి, సుస్మిత సభ్యులు ఉమ్మడిగా దుస్తుల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. వ్యాపారంలో వచ్చిన లాభాలతో బ్యాంకు అప్పు తీరుస్తున్నారు.

అక్కచెల్లెమ్మలపై కరుణ

- బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు
- 2022–23లో లింకేజీ రుణాల లక్ష్యం రూ.697 కోట్లు
- 18,395 సంఘాలకు రూ.798 కోట్ల పంపిణీ
- గరిష్టంగా రూ.20 లక్షల వరకు లింకేజీ రుణం
- వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలు
- మెరుగుపడిన జీవనోపాధులు



పచ్చళ్ల తయారీలో రాణిస్తున్న మహిళలు

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత నిస్తోంది. జీవనోపాధుల పెంపునకు కృషి చేస్తోంది. బ్యాంకులు సైతం విరివిగా రుణాలు ఇస్తున్నాయి. 2022–23లో లక్ష్యానికి మించి పొదుపు మహిళలకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో డీఆర్‌డీఏ–వైకేపీకి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు రూ.697 కోట్లు బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా ఇచ్చారు. లక్ష్యానికి మించి 18,395 సంఘాలకు రూ.758 కోట్లు రుణాలుగా పంపిణీ చేశారు. పట్టణ ప్రాంతాల్లోని పొదుపు మహిళలకు రూ.198 కోట్లు లింకేజీ రుణాలుగా పంపిణీ చేయాలనేది లక్ష్యం. అయితే రూ.208 కోట్లు ఇచ్చారు.

2023–24లో మరింత పెద్ద ఎత్తున లింకేజీ రుణాలను బ్యాంకుల ద్వారా పంపిణీ చేయించేందుకు డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బ్యాంకర్లను, పొదుపు సంఘాలను సమన్వయం చేసుకుంటూ రుణాలు ఇప్పించడంలో ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

లింకేజీ రుణాలు పెంచుతూ..

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వాటిని గడువులోపు చెల్లిస్తే 7 నుంచి 9 శాతం వరకు మాత్రమే వడ్డీ పడుతుంది. స్వయం సహాయక సంఘాలు కూడా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటూ.. వాటిని సక్రమంగా చెల్లిస్తూ జీవనోపాధుల్లో విశేషంగా రాణిస్తున్నారు. కొత్తగా పొదుపు సంఘం ఏర్పాటు చేసుకొని సమావేశం నిర్వహించి తీర్మానం చేసుకుంటే మొదట రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బ్యాంకు రుణం ఇస్తుంది. తీసుకున్న రుణాన్ని నియమావళి ప్రకారం చెల్లిస్తే బ్యాంకులు లింకేజీ రుణాలను పెంచి ఇస్తాయి. జిల్లాలోని దాదాపు 5,000 సంఘాలు ఇప్పటి వరకు 10 దఫాల వరకు రుణాలు పొందాయి. గరిష్టంగా లింకేజీ కింద రూ.20 లక్షల వరకు రుణం పొందవచ్చు. పేదరికం నుంచి బయటపడేందుకు స్వయం సహాయక సంఘాలు తోడ్పడుతున్నారు. రుణాలను గడువులోపు చెల్లించడం ద్వారా పొదుపు మహిళలు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి అర్హత పొందుతున్నారు. రూ.3 లక్షల వరకు రుణానికి వైఎస్ఆర్ సున్నా వడ్డీ వర్తిస్తుంది.

మహిళామార్ట్‌లతో ఉపాధి

అక్కచెల్లెమ్మలకు అన్ని వైపుల నుంచి ప్రోత్సాహం లభిస్తుండటంతో స్వయం ఉపాధిలో విశేషంగా రాణిస్తున్నారు.పొదుపు మహిళలు తయారు చేస్తున్న వివిధ వస్తువులకు మార్కెటింగ్ కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల, అమ్మకాల కేంద్రం ఏర్పాటైంది. ఇందులో జిల్లా వ్యాప్తంగా మహిళలు ఉత్పత్తి చేసిన వాటిని అమ్ముకునే అవకాశం ఏర్పడింది. పొదుపు మహిళలు స్వంత పెట్టుబడితో చేయూత మహిళా మార్ట్‌లు నడుపుతున్నారు. కోడుమూరులో నెలకొల్పిన మహిళా మార్ట్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది.రానున్న రోజుల్లో అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో మహిళా మార్ట్‌లను నెలకొల్పడానికి కసరత్తు జరుగుతోంది.కొందరు మహిళలు పసుపు, కారం పొడి మిషన్లు ఏర్పాటు చేసుకొని.. వాటిని ప్యాక్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. మరికొందరు ఊదిబత్తీలు తయారు చేస్తున్నారు. ఇంకొందరు పొట్టేళ్ల, పెరటికోళ్ల పెంపకంలో రాణిస్తున్నారు. పాడి పరిశ్రమ, పాలకోవ తయారీ, చీరల వ్యాపారాల్లో పలువురు అనుభవం గడిస్తున్నారు.

24,268 సంఘాలకు ఏ–గ్రేడ్

మండలాలు, గ్రామాల వారీగా ఉన్న స్వయం సహాయక సంఘాల పనితీరును బట్టి గ్రేడ్‌లు ఇస్తారు. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడం, రికార్డులు పక్కాగా రాయడం, రుణాలను సద్వినియోగం చేసుకొని జీవనప్రమాణాలను మెరుగుపరుచుకోవడం తదితర వాటి ఆధారంగా సంఘాలకు గ్రేడింగ్ ఇస్తారు. జిల్లాలోని మొత్తం సంఘాలు 32,451 ఉన్నాయి. ఇందులో 24,262 సంఘాలు ఏ–గ్రేడ్‌లో ఉన్నాయి. బీ–గ్రేడ్‌లో 7241, సీ–గ్రేడులో 926, డి.గ్రేడ్‌లో కేవలం 2 సంఘాలు మాత్రమే ఉన్నాయి. బీ–గ్రేడ్ సంఘాలను ఏ–గ్రేడ్‌లోకి, సీ,డీ–గ్రేడ్ సంఘాలను బి.గ్రేడ్‌లోకి తీసుకవచ్చేందుకు కసరత్తు జరుగుతోంది.

మహిళల జీవనోపాధులకు భరోసా



స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులకు 100 శాతం భరోసా ఇస్తున్నాం. జిల్లాలో 32,451 పొదుపు సంఘాలు ఉన్నాయి. సంఘాలకు బ్యాంకుల ద్వారా గరిష్టంగా రూ.20 లక్షల వరకు రుణాలుగా ఇప్పిస్తున్నాం. అంతేగాక స్త్రీ నిధి కింద అన్ని వర్గాల మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేకంగా ఉన్నతి కింద రుణాలు ఇస్తున్నాం. ప్రభుత్వం కూడా వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, జగనన్నతోడు వంటి కార్యక్రమాలు అమలు చేస్తోంది. మహిళలను ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవనోపాదులను మెరుగుపరుచుకుంటున్నారు. – వెంకటసుబ్బయ్య,
ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ–వైకేపీ



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. సృజన, చిత్రంలో ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీ బుట్టారేణుక

విద్యతోనే అభివృద్ధి

- బడుగు, బలహీన వర్గాలకు దిశానిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి పూలే
- ఆయన బాటలో పయనిస్తున్న ప్రభుత్వం
- రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ డా.జి.సృజన
- ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు
- హాజరైన ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య



పుష్పాలంకరణలో జ్యోతిరావు పూలే విగ్రహం

కర్నూలు(అర్బన్): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని శతాబ్దాల క్రితమే మహాత్మా జ్యోతిరావు పూలే భావించి చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు స్థానిక బిర్లాగేట్ సమీపంలోని పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, కర్నూలు ఎంపీ డా.ఎస్. సంజీవ్‌కుమార్, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు హాజరయ్యారు. ముందుగా వారు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... బడుగు, బలహీన వర్గాలకు దిశానిర్దేశం చేసి వారి అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. అంటరానితనం, అవిద్య, బాల్య వివాహాలు తదితర రుగ్మతలపై అనేక ఉద్యమాలు చేసి దేశంలోనే మహాత్మా అని పిలిపించుకున్నారన్నారు. ముఖ్యంగా మహిళల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, తన సతీమణి సావిత్రీ బాయి పూలేను దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసి ఎందరో మహిళలకు అక్షరాభ్యాసం చేయించారన్నారు. ఆయన చూపిన మార్గంలో మన మందరం నడవాలని ఆమె పిలుపునిచ్చారు. పూలే బాటలోనే మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు క్రా హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి డా.పార్థసారథి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ. నాగేశ్వర రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్, ఆర్‌డీఓ హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ జంగం రేవతి, వెంకాయపల్లె దేవస్థానం చైర్మన్ బేతం క్రిష్ణుడు, నాయకులు గడ్డం రామక్రిష్ణ, బత్తుల లక్ష్మీకాంతయ్య, వాడాల నాగరాజు, వేంపెంట రాంబాబు, కె. రామక్రిష్ణ, బాలసంజన్న, రెడ్డిపోగు రాజ్‌కుమార్, సోమసుందరం మాదిగ, కై లాస్‌నాయక్, గురుశేఖర్, శేషఫణి, మోహన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక షరీన్‌నగర్‌లోని పూలే, డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు జిల్లా కలెక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.

బీసీల ఆత్మగౌరవానికి ఆద్యులు

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ అని చెప్పిన విధంగానే వారికి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్న గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. బీసీలకు ఆత్మ గౌరవంతో పాటు వారి జీవనానికి వనరులు కల్పిస్తున్నారు. ఆనాడు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంటరానితనం నిర్మూలన కోసం పూలే కృషి చేస్తే నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పెద్ద పీట వేస్తున్నారు.

– ఎంపీ డా.ఎస్. సంజీవ్‌కుమార్

ఐకమత్యంగా ఉందాం

ఐకమత్యంగా ఉండి అన్ని సమస్యలను పరిష్కరించుకుందాం. ప్రస్తుతం బిర్లాగేట్ సమీపంలో ఉన్న పూలే విగ్రహాన్ని రోడ్డు మధ్యకు తీసుకురావడం, జొహరాపురంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, బీసీ భవన్ నిర్మాణం తదితర వాటిపై కలిసి సాగుదాం. ఈ నెల 12వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నేతలందరం మా స్వగృహంలో సమావేశమై సమస్యల సాధనకు కార్యచరణ రూపొందించుకుందాం.

– కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

బలహీన వర్గాలకు ప్రాధాన్యత

పూలే ఆశించిన విధంగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అన్ని రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు చేయలేని అనేక కార్యక్రమాలు నాలుగేళ్ల పాలనలో వైఎస్ జగన్ చేసి చూపిస్తున్నారు. కుల మతాలు,పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు.

– పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

పూలే బాటలో జగన్ పాలన

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుంది. ఆనాడు జ్యోతిరావు పూలే విద్యకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో, నేడు వైఎస్ జగన్ కూడా విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తున్నారు. నాడు - నేడు కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.

–నగర మేయర్ బీవై రామయ్య

నేడు జేసీగా ఎన్.మౌర్య బాధ్యతల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన నారపురెడ్డి మౌర్య బుధవారం బాధ్యతలు చేపడతారు.ఉదయం 10 గంటలకు ఆమె కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తారు. కాగా, ఆమె మంగళవారం రాత్రే కర్నూలు చేరుకోగా డీఆర్వో, ఆర్‌డీఓ స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్–19 ఫోర్త్‌వేవ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. కోవిడ్ సన్నద్ధతలో భాగంగా మంగళవారం ఆసుపత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ట్రయేజ్ ఏరియా, జగనన్న ప్రాణవాయువు, ఆక్సిజన్ ప్లాంట్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, సర్జికల్ స్టోర్‌లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆక్సిజన్ నిల్వలు, ఆక్సిజన్ సామర్థ్యాన్ని పరిశీలించారు. సర్జికల్ స్టోర్‌లో కిట్స్, మాస్కులు, అత్యవసర మందులు, గ్లౌజులు, పల్స్ ఆక్సీమీటర్లు సిద్ధంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆసుపత్రిలో కోవిడ్ కేసులు ఏవైనా అత్యవసరంగా వస్తే వాటిని ఎలా నిర్వహించాలనే దానిపై చర్చించారు. ట్రయేజ్‌లో 40 పడకలు, వెంటిలేటర్లు, 40 ఆక్సిజన్ బెడ్స్ ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఈఎండీ ఇన్‌చార్జ్ డాక్టర్ రామశివనాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్, వైద్యులు పాల్గొన్నారు.



ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైద్యులు

చేనేత కార్మికులకు ముద్రా రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి చేనేత పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా 420 మంది చేనేత కార్మికులకు ముద్రా రుణాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 390 మందికి రూ.1.95 కోట్లు, నంద్యాల జిల్లాలో 130 మంది చేనేత కారులకు రూ.65 లక్షల ముద్రా రుణాల పంపిణీకి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. రూ.50 వేల నుంచి గరిష్టంగా రూ.2లక్షల వరకు రుణాలను బ్యాంకుల నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేస్తే సంబంధిత బ్యాంకులకు పంపుతామన్నారు. ముద్రా రుణాలపై 20 శాతం లేదా రూ.25 వేలు.. ఇందులో ఏదీ తక్కువైతే దానిని సబ్సిడీగా అందజేస్తామన్నారు.

కేఎంసీకి పీజీ సీట్ల వరద

- ఎన్నడూ లేని విధంగా 30 సీట్లు మంజూరు
- తాజాగా ఆరు సీట్లు మంజూరు



కర్నూలు మెడికల్ కాలేజీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే సంవత్సరంలో 30 పీజీ సీట్లు మంజూరయ్యాయి. నెల రోజుల క్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీ బృందం 30 పీజీ సీట్లకు తనిఖీలు నిర్వహించగా అందులో మొత్తం సీట్లు మంజూరు కావడం విశేషం. ఇందులో తాజాగా ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, ఎండోక్రైనాలజి విభాగాలకు రెండేసి సీట్లు మంజూరయ్యాయి. దీంతో కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ సీట్ల లభ్యత పెరిగి దేశవ్యాప్తంగా కళాశాలకు మరింత గుర్తింపు లభించనుంది.

పెరిగిన సీట్లు ఇలా...

డిపార్ట్‌మెంట్	ప్రస్తుతమున్న సీట్లు	పెరిగిన సీట్లు
మైక్రోబయాలజి	2	4
ఫోరెన్సిక్ మెడిసిన్	1	5
ఆర్థోపెడిక్స్	11	2
ఆబ్‌స్టెట్రిక్స్, గైనకాలజి	12	6
అనెస్తీషియా	12	3
ఈఎన్‌టీ	6	2
పల్మనలరి మెడిసిన్	2	2
గ్యాస్ట్రో ఎంట్రాలజి	2	2
న్యూరాలజి(కొత్త సీట్లు)	0	2
ఎండోక్రైనాలజి(కొత్త సీట్లు)	0	2

క్లుప్తంగా

ఎల్లెల్సీలో తగ్గిన నీటి ప్రవాహం



కాలువలో తగ్గిన నీటి ప్రవాహం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) హొళగుంద సెక్షన్‌లో మంగళవారం ఉదయం నీటి ప్రవాహం తగ్గింది. వేసవికాలానికి తోడు టీబీ డ్యాంలో నీటి మట్టం పూర్తిగా పడిపోవడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఎల్లెల్సీకి నీటి సరఫరాను పూర్తిగా నిలిపి వేశారు. దీంతో మంగళవారం ఉదయం హొళగుంద వద్ద దాదాపు ఐదడుగుల మేర నీటి మట్టం తగ్గింది. బుధవారం సాయంత్రానికి ప్రవాహం పూర్తిగా ఆగిపోనుంది. కాగా తాగు నీటి అవసరాల కోసం టీబీ బోర్డు అధికారులు వచ్చే నెలలో కొద్ది రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు.

డ్యాంలో 3.338 టీఎంసీల నీరు నిల్వ

టీబీ డ్యాంలో మంగళవారం ఉదయం 1633 అడుగులకు గాను 1577.40 అడుగుల నీటి మట్టం ఉంది. 105.788 టీఎంసీలకు గాను 3.338 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1591.66 అడుగులతో 11.141 టీఎంసీల నీరు నిల్వ ఉండేది.

వృద్ధుడి శవం లభ్యం



మృతి చెందిన వృద్ధుడు

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామ రహదారి పక్కన ఉన్న పొలంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 70 ఏళ్ల వయస్సు ఉంటుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని హెడ్ కానిస్టేబుల్ రంగయ్య తెలిపారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

రుద్రవరం: ఆర్.కొత్తూరు వద్ద మంగళవారం ఆటో బోల్తా పడటంతో ఆరుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన కొందరు కూలీలు మంగళవారం ఎండుమిర్చి కోతకు ఆటోలో లింగాలకు వెళ్లారు. పనుల అనంతరం తిరిగి వస్తుండగా ఆర్.కొత్తూరు వద్ద గేదెలు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమలో డ్రైవర్ ఆటోను పక్కకు తిప్పగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న రిపకమ్మ, బాలమ్మకు తీవ్ర గాయాలు కాగా లక్ష్మీదేవి, ఆది లక్ష్మి, నాగలక్షమ్మ, నారాయణమ్మ స్వల్ప గాయాలు అయ్యాయి. క్షత గాత్రులను రుద్రవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి క్షత గాత్రులను పరామర్శించారు. అనంతరం తీవ్ర గాయాలైన ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3968	రూ. 7229
పొద్దుతిరుగుడు	రూ. 4559	రూ. 4749
ఆముదం	రూ. 3889	రూ. 5764
వాము	రూ. 4220	రూ. 24888
ఉల్లి	రూ. 330	రూ. 730
ఎండు మిర్చి	రూ. 3599	రూ. 39611
శనగలు	రూ. 1510	రూ. 4860
కందులు	రూ. 3000	రూ. 8040
మొక్కజొన్న	రూ. 1649	రూ. 1929
మినుములు	రూ. 6910	రూ. 7349
కొర్రలు	రూ. 2560	రూ. 2560
సోయా చిక్కుడు	రూ. 4269	రూ. 4269

ఎస్‌ఏ-2 పరీక్షలకు సన్నద్ధం

- ఈనెల 20 నుంచి పాఠశాల విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం
- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్‌సీఈఆర్‌టీ
- ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- వచ్చే నెల 1 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు



కర్నూలు సిటీ: ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో భాగంగా సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)–2 పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఫస్ట్ క్లాసు నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 6 నుంచి 9వ తరగతి వరకు 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉదయం 9 గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు 2.89 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 2022–23 విద్యా సంవత్సరం ఆఖరి రోజు ఈ నెల 30తో ముగియనుంది. మే నెల 1వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, విద్యాశాఖ నుంచి అధికారికంగా ఆదేశాలు రావాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ఎండల తీవ్రతగా ఎక్కువగా ఉండడంతో విద్యార్థుల ఆరోగ్యంపై ఆయా స్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

పాఠశాల విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ జారీ చేసింది. ఈ నెల 20వ తేదీన 1–9 తరగతులకు సంబంధించిన తెలుగు, 1–5 తరగతులకు 24న ఇంగ్లిషు, 6–9 తరగతులకు సెకెండ్ లాంగ్వేజ్, 25వ తేదీ 1–5 తరగతులకు గణితం, 6–9 తరగతులకు ఇంగ్లిషు, 26వ తేదీ 3,4,5 తరగతులకు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, 6–9 తరగతులకు గణితం, 27వ తేదీన 3,4,5 తరగతులకు ఒరియెంటల్ పరీక్ష, 6–9 తరగతులకు సైన్స్, 28వ తేదీన 6–9 తరగతులకు సోషల్, 29వ తేదీన కాంపొజిట్ కోర్సులకు పరీక్షలు ఉంటాయి.

సీబీఏ విధానంలో పరీక్షలు

తరగతి ఆధారిత మదింపు(క్లాసు రూం బేస్డ్ అసెస్‌మెంట్(సీబీఏ)విధానంలోనే సమ్మేటివ్–2 పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌సీఈఆర్‌టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తుంది. ఫార్మెటీవ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)–1, 3 పరీక్షలను ఇప్పటికే అమలు చేయగా ఎఫ్‌ఏ–2, ఎఫ్‌ఏ–4, సమ్మేటివ్–1 పరీక్షలను పాత విధానంలోనే అధికారులు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన జరగనున్న పరీక్షలకు సైతం సీబీఏ(ఓఎంఆర్)విధానాన్ని అమలు చేయనున్నారు.

సంగమేశ్వరుడి సేవలో..



శివలింగానికి పూజలు చేస్తున్న రాయలసీమ జోన్ హోంగార్డు కమాండెంట్ ఎస్పీ మహేష్ కుమార్

కొత్తపల్లి: సప్తనదుల సంగమతీరంలో వెలసిన సంగమేశ్వరుడిని రాయలసీమ జోన్ హోంగార్డు కమాండెంట్ ఎస్పీ మహేష్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆయన వేపధారు శివలింగానికి నదీజలాలతో అభిషేకం, పాలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. హోంగార్డు ఎస్పీకి ఆలయ పురోహితులు ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం కొలనుభారతి ఆలయాన్ని చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే జరిమానా

- ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల సమీక్షలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కార్యాలయం అంటే దేవాలయంతో సమానం.. అలాంటి కార్యాలయాలే అపరిశుభ్రంగా ఉంటే సిబ్బంది ఎలా విధులు నిర్వహిస్తారు? కలెక్టరేట్ అంటే పరిశుభ్రతకు నిలయంగా ఉండాలి. ఇక్కడ మాత్రం ఒక్క సీపీఓ, పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు తప్ప మిగతావన్నీ చెత్తాచెదారాలకు నిలయంగా ఉన్నాయి. ఇలాంటప్పుడు స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ కర్నూలు అని ఎలా చెప్పగలం అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లా ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ శాఖ కార్యాలయాన్ని ఆ శాఖ సిబ్బందే వారంలోపు శుభ్రం చేసుకోకపోతే జరిమానా విధిస్తానని హెచ్చరించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టరేట్ దుస్థితిపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి ఏ శాఖ కార్యాలయం కూడా అపరిశుభ్రంగా ఉండటానికి వీలులేదన్నారు. విరిగిపోయిన కుర్చీలు, బల్లలు, సెల్ఫ్‌లు, కాగితాలను వెంటనే తొలగించాలని.. వ్యర్థాలను తరలించేందుకు చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజను ఆదేశించారు. వచ్చే వారంలోపు మార్పు కనిపించాలన్నారు. అన్ని కారిడార్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి తానే స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. కార్యాలయాల మరమ్మతులకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది టీ, కాఫీలు తాగడానికి డిస్పోజల్ గ్లాసులు కాకుండా స్టీల్ గ్లాసులను వినియోగించాలన్నారు. అలాగే నీళ్లు తాగేందుకు డిస్పోజల్ బాటిళ్లు కాకుండా వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటే మంచిదని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరారవు, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

అల్లుడి వేధింపులు తాళలేక..

- రైలు కింద పడి కుటుంబం ఆత్మహత్యాయత్నం
- ఒకరి మృతి



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: అల్లుడి వేధింపులు తాళలేక తమిళనాడుకు చెందిన ఓ కుటుంబం రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం ఆదోనిలో చోటు చేసుకున్న ఈఘటనలో ఒకరు మృతి చెందారు. రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని వేలూరు జిల్లా తెరమన్‌బట్టు తాలూకా సాదాగర్ గ్రామానికి చెందిన పద్మనాభం(59), సెల్వి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. కరోనా సమయంలో పెద్ద కుమార్తె చనిపోగా, చిన్న కుమార్తె జీవిత ఉంది. 15 ఏళ్ల క్రితం వివాహమైన ఈమెకు ఆది నుంచి భర్త మహేష్ అదనపు కట్నం పేరుతో వేధిస్తున్నాడు. పూటగడవని పరిస్థితుల్లో ఉన్న తాము ఇచ్చుకోలేమని అల్లుడిని మొరపెట్టుకున్నారు. అయినా, తీరు మారకపోవడంతో కుమార్తె తల్లిదండ్రుల వద్దకు చేరింది. చివరకు దిక్కుతోచని పరిస్థితుల్లో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం రాత్రి బెంగళూరు నుంచి ముంబాయి వెళ్లే ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మార్గమధ్యంలో ట్రైన్‌లో నుంచి దూకేందుకు యత్నించారు. అయితే, వీలుకాకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున ఆదోనిలో దిగారు. కొద్దిసేపు ప్లాట్‌ఫాంపై నిలబడి ట్రైన్ కదిలే సమయంలో దాని కింద దూరి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. అక్కడే డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఖాద్రి గమనించి పట్టాలపైకి పరుగులు తీసి బయటకు లాగారు. అప్పటికే తల్లి, కుమార్తెలిద్దరి తలలకు గాయాలు కాగా, పద్మనాభం ఎడమ చేయి విరిగిపోయింది. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పద్మనాభం కోలుకోలేక మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

భూసార పరీక్షల ప్రయోజనాలు తెలియజేయండి

- జిల్లా స్థాయి వర్క్‌షాపులో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి



భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): భూసార పరీక్షలతో కలిగే ఉపయోగాలపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం పెద్ద ఎత్తున భూసార పరీక్షలు నిర్వహించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందే విధంగా రైతులను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు సబ్ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలం నన్నూరులో భూసార పరీక్షలపై నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాపులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్‌బీకే ఇన్‌చార్జ్ మొదలు ఏడీఏ వరకు భూసార పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని తెలిపారు. పరీక్షలను ప్రామాణికంగా తీసుకుని రసాయన ఎరువులు, సూక్ష్మ పోషకాలను వాడితే రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాడు నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని తెలిపారు. అంతేకాకుండా భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. చౌడు ఏ మోతాదులో ఉందో తెలుసుకొని చౌడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి మండల స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించి.. ఆయా మండలాల్లోని ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు అవగాహన కల్పించాలని సూచించారు. మే నెల చివరి నాటికి రైతులకు భూసార పరీక్ష ఫలితాలు చేరే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కర్నూలు జిల్లాలో సేకరించే మట్టి నమూనాలను ఎమ్మిగనూరులోని భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తారని, నంద్యాల జిల్లాలో సేకరించే మట్టి నమూనాలను కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తారని తెలిపారు. అంతకు ముందు భూసార పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీ శ్రీలక్ష్మి, ఏడీఏలు వేదమణి, వెంకటేశ్వర్లు, బనవాసి కేవీకే శాస్త్రవేత్తలు లక్ష్మన్న, నాయక్, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, సునీత, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

జైళ్లను తనిఖీ చేసిన జడ్జి



మహిళా జైలులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.వి.నాగశ్రీనివాసరావు మంగళవారం పంచలింగాల సమీపంలోని జిల్లా జైలును, నగరంలోని మహిళా జైలును తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అక్కడ ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. 65 సంవత్సరాలు పైబడిన ఖైదీల వివరాలు సేకరించారు. ఉన్నత న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటు చేసిన చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ ఎస్.మనోహర్, డీఎల్ఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఆలూరు: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశించారు. దేవనకొండ మండలంలోని కరివేముల గ్రామంలో సాగు చేసిన పండ్ల తోటలను,ఉపాధి పనులను పీడీ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీడీ పద్మావతి ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కొత్తపల్లి: విద్యుదాఘాతానికి గురై కోతమిషన్ హెల్పర్ మృతిచెందాడు. మంగళవారం రాత్రి నందికుంట పొలిమేరలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హర్యానా రాష్ట్రానికి చెందిన నందు (24) గత కొన్నేళ్లుగా పాములపాడు సుబ్బారెడ్డికి చెందిన మొక్కజొన్న కోతమిషన్‌కు హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి నందికుంట పొలిమేరలో దుద్యాల గ్రామానికి చెందిన కోలగుంట్ల బాబు అనే రైతు పొలంలో మొక్కజొన్న పంట కోతకు వెళ్లాడు. ఈ క్రమంలో మిషన్‌పైకి ఎక్కగా పొలంలో ఉన్న విద్యుత్ తీగలు తలకు తగిలాయి. షార్ట్‌సర్క్యూట్ అయి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న రైతులు బైక్‌పై చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆహార పరిశ్రమలతో జీవనోపాధుల అభివృద్ధి

- ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహనలో డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆహార శుద్ధి పరిశ్రమల ద్వారా జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. మంగళవారం సాయంత్రం డీఆర్‌డీఏ–వైకేపీలోని సమావేశ మందిరంలో ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహార శుద్ధి పరిశ్రమల కింద ఉల్లి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని, ఇప్పటికే జిల్లాలో అనేకమంది మహిళలు సోలార్ డ్రయర్స్ ద్వారా ఉల్లి ప్లేట్‌లెట్ల తయారీలో రాణిస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీలు 35 శాతం వరకు ఇస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కర్నూలు మండలం తడకనపల్లిలో అనేకమంది మహిళలు సోలార్ డ్రయర్స్ ద్వారా ఉపాధి పొందుతున్నారని, ఇతర మండలాల మహిళలను అక్కడికి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రమణారెడ్డి, ఎల్‌డీఎం వెంకటనారాయణ పొదుపు మహిళలు పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను వివరించారు. అంతకు ముందు జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పీడీ వెంకటసుబ్బయ్య, అడిషనల్ పీడీ శ్రీధర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీధర్ రావు, లైవ్లీహుడ్ డీపీఎం నర్సమ్మ, ఫైనాన్స్ డీపీఎం అబ్దుల్ రహిమాన్, డెయిరీ డీపీఎం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుద్దాం



నినాదాలు చేస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



హాజరైన ప్రజలు

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

కౌతాళం: అందరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. కౌతాళం మండల పరిధిలోని తోవి, చూడి, బాపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఎస్సీ కమిషన్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై వాటిని ప్రారంభించారు. బాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటికీ చాలా గ్రామాల్లో అంటరానితనం కనిపిస్తుందని, దీనిని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం దళితుల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అంతకు ముందు ఏరిగేరి గ్రామంలో అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు, రెండు తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక చైర్మన్ విమలక్క, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధి రమేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకుడు ప్రదీప్ రెడ్డి, రాయలసీమ హక్కుల పోరాట సమితి నాయకుడు ఈరన్న, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి, వైస్ ఎంపీపీలు బుజ్జి స్వామి, సాద్రి బసవరాజు, ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, కోసిగి సీఐ ఏరిషావలి, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదం జరగకుండా చర్యలు



కొండరాయిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

గోనెగండ్ల: గోనెగండ్లలోని నరసప్ప దేవాలయం దగ్గర ఎండ వేడిమికి పగిలిన కొండ రాయి ద్వారా చుట్టుపక్కల వారికి ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం మైనింగ్, ఆర్ అండ్‌బీ అధికారులు, గ్రీన్‌కో, జిందాల్ ఫ్యాక్టరీల ప్రతినిధులతో కలిసి ఆయన కొండను పరిశీలించారు. ఎక్కడెక్కడ రాళ్లకు చీలికలు వచ్చాయని పరిశీలించారు. స్థానిక ఎస్సీ కాలనీ వాసులతో కొండ రాయి ఎలా పగిలిందని ఆరా తీశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కొండ చుట్టు పక్కల ఉన్నవారికి ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పగిలిన రాయి దాదాపు 6వేల టన్నుల బరువు ఉంటుందన్నారు. దీనిని తొలగించడంపై జిల్లా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి కాలనీని డెంజర్ జోన్‌గా ప్రకటించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సురేష్ బాబు, మైనింగ్ ఏడీ నాగిని, తహసీల్దార్ వేణు గోపాల్ పాల్గొన్నారు.

కర్నూలు చేరుకున్న కొత్త పోలీస్ బాస్

కర్నూలు: జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన జి.కృష్ణకాంత్ కర్నూలుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. బుధవారం ఉదయం 9–10 గంటల మధ్య జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా 39 మంది ఐపీఎస్‌లకు ఈనెల 8వ తేదీన స్థానచలనం కలిగిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణకాంత్‌ను కర్నూలుకు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు చీఫ్ ఆఫీస్ నుంచి మంగళవారం కౌంటర్ డీఓ విడుదల కావడంతో బాధ్యతలు చేపట్టేందుకు మంగళవారం రాత్రి ఆయన కర్నూలు బి.క్యాంప్‌లోని పోలీసు అతిథిగృహానికి చేరుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ APRJC, POLYCET, SHRESTA, (8&10 Classes) YASHASVI (8&10 Classes), నవోదయ సైనిక్ స్కూల్ల మొదలైన ప్రవేశ పరీక్షల కొరకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వబడును. హాస్టల్ వసతి కలదు. సంప్ర: RIGHT Academy, KNL. Cell: 94939 02958 [L-799167]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-486]

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30×40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్షలు మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 98884 24222 [L-799160]

■ కర్నూలు – ఓర్వకల్లు దగ్గర జయరాజ్ స్టీల్ ప్లాంటుకు వెళ్ళే దారిలో అతి తక్కువ ధరకు ఓపెన్ ప్లాట్లు కలవు. (30x40) స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కలదు. క్రిష్ణమూర్తి – 95330 49765 [L-795188]

HOUSE FOR SALE

■ బాలాజీనగర్‌లో ఉత్తరం 7.5 సెంట్లలో 2 షాపులు, 3 కార్ల పార్కింగ్‌తో, హోమ్ థియేటర్ పెట్టుకోగల 25 అ॥ల హాలుతో 10 రూముల ఇల్లు అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్ – 89198 68887 [L-799159]

LEASE/RENT

■ కర్నూలు కొత్త బస్టాండ్ వద్ద వసుంధర కాంప్లెక్స్‌లో తూర్పు ఫేస్ 3rd ఫ్లోర్ 9800 SFT బ్యాంక్స్, ఆఫీసులకు లీజు, అద్దె, అమ్మకంనకు కలదు. 80080 01740, 79979 24312 [L-2-2023]

LEASE

■ నంద్యాల పట్టణం SBI కాలనీలో సుదీర్ఘ కాలం ప్రసూతి వైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందిన MR.హాస్పిటల్ లీజుకు ఇవ్వబడును. సంప్ర: 99855 67512 [L-795182]

SERVICES

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-04]

BUSINESS OFFER

■ Globale avanu కంపెనీకి ప్రాతినిధ్యం వహించడానికి ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలలో జీవిత అర్హతను కల్గి మంచి నైపుణ్యం కలిగిన ఏజెంట్స్ కావలెను. మంచి జీతం & Incentives. ✆ 7428038734 [T-1201073]

WANTED

■ ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: ఇంటర్/డిగ్రీ. జీతం + ఇన్సెంటివ్స్ కలవు. సంప్ర: VR. ప్లాజా, బిర్లా కాంపౌండ్, కర్నూలు. 90308 20894/895 [L-799182]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ స్కంధాన్షి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌లో నంద్యాలలో పనిచేయుటకు మార్కెటింగ్ జాబ్స్ కలవు. సంప్ర: 97034 81989 [L-795192]

■ కర్నూలు, నంద్యాలలో Havells కంపెనీలో పనిచేయుటకు టెక్నీషియన్స్ కావలెను. సంప్ర: ఠాగూర్ నగర్, కర్నూలు. సెల్: 93921 89251 [L-795191]

■ కర్నూలు జిల్లాలో గల ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. అర్హత: 10th పాస్/ఫెయిల్. జీతం 11,000/-. డ్యూటీ 12 గంటలు సం.ప్ర. 95817 76924, 96524 47856 [L-799181]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & మేనేజర్స్, స్త్రీ/పురుషులు కావలెను. జీతం + ఇన్సెంటివ్స్ కావలెను. సంప్ర : కర్నూలు. 94900 12607 [L-799158]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190666]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785720]

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO, క్లర్క్, క్యాషియర్స్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను(M/F). ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి: 90630 09249. [NA-2823]

■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15000 నుంచి 20,000 వరకు జీతం.మరిన్ని వివరాలకై 7815811791 [G-785728]

■ మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ కావలెను. జీతం: 16000/- – ఉచిత వసతి భోజన సౌకర్యం ఉంటుంది. ఈఎస్ఐ, పిఎఫ్ అదనం. ఫోన్ : 6300661014. [HA-016]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 16K–18K విజయవాడ. ఫోన్: 9640528899, 9640648899 [H-793409]

■ Hydలో ప్రముఖ ఇ-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీ. 15,000–30,000. ఫోన్:8367003580 [HA-10718]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [H-16]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18–28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-796771]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725